# చందమామకూ ఓ మచ్చ

రాణి వసారాలో ఓ మెట్టుమీద కూర్చుంది. ఎదురుగా చిన్నతాటాకు బుట్టనిండా ఎఱ్ఱని కనకాంబరాలు, పచ్చని చేమంతులు ఉన్నాయి. రాణికి పూలంటే చాలా యిష్టం. అందులో ఆ కనకాంబరాలు, పచ్చని చామంతులు అంటే మరింత యిష్టం. అన్నీ తానే కోసి తెచ్చుకుంది. తల్లి పై మెట్టు మీద కూర్చొని జడ అల్లుతోంది. మాణిక్యాంబకి తలదువ్వి జడవేయడం మరింత యిష్టం. నల్లగా, ఒత్తుగా, పొడవుగా ఉండే జుట్టు నున్నగా దువ్వి మధ్యలో కనకాంబరాలు పెట్టి జడ అల్లుతోంది. రాణీ బుట్టలో పూలు తీసి పచ్చని చేమంతుల మధ్యలో కనకాంబరాలు పెట్టి ముద్దగా మాల అల్లుతోంది.

అంతలో సన్నగా వానజల్లు ప్రారంభమయింది.

"మబ్బులే లేవు వానజల్లు ఎలాపడుతుందో?" ఆశ్చర్యంగా అడిగింది రాణి.

"అందుకే వానరాకడ ప్రాణం పోకడ తెలీదంటారు!" తల్లి సమాధాన మిచ్చింది.

"అవునమ్మా! మావయ్య కోపం కూడా అంతే!" రాణి పకపకా నవ్వింది.

కూతురి మాటలకి మాణిక్యాంబ నవ్వకుండా ఉండలేకపోయింది. అంతలో మేనమామ అప్పారావు అక్కడ వాలాడు.

"ఏమే కుంటి దానా! నీ కెందుకే ఇంత షోకు! ఈ పూలన్నీ నీ తలలో పెట్టుకోవడానికే?" పూలబుట్ట కాలితో తన్నుకుంటూ వెళ్ళిపోయాడు.

అంతవరకు జ్ఞాపకంలేని కుంటితనాన్ని ఒక్కసారి జ్ఞాపకం చేసినట్టయింది. ఆ తల్లి మనస్సు చివుక్కుమంది. రాణి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "అన్నా! పిల్లలు అందరూ ఉన్నా డబ్బులేని వాళ్ళు ఎవరూ లేని వాళ్ళే! వాళ్లని ఓదార్చేవాళ్ళెవరు? ఒకళ్ళ నొకళ్ళు ఓదార్చుకోవలసిందే. ఉన్న ఊరు, సొంత ఇల్లు వదలుకుని వచ్చాం ఇదిగో! బుట్టలోని పువ్వుల్లాగే నేలపాలయ్యాం!". గుండె చెరువవుతుంటే అదిమి పట్టుకుంది మాణిక్యాంబ. వచ్చే కన్నీళ్ళు ఆపుకుంది రాణి!

తిరిగి పువ్వులన్నీ బుట్టలోకి ఎత్తింది రాణి. ఆ తల్లి కూతురి జడపూర్తి చేసింది. మోకాలు దిగి ఉన్న జడను తృప్తిగా చూసుకుంది. జానెడు మేర మాత్రమే కనకాంబరాలతో అల్లింది. మిగిలిన జడ మనసులేక మామూలుగానే అల్లింది. రాణి చేతిలోని కట్టిన మాల అందుకుని తల్లో పెట్టి తృప్తిగా చూసి సంబరపడింది. పాలపొంగులా దుఃఖంకాస్త చల్లారగానే ఇద్దరి మనస్సులు కుదుటపడ్డాయి.

మాణిక్యాంబ, నరసయ్య దంపతులకి లేక లేక పుట్టింది ఆడపిల్ల. "ఏం పేరు పెట్టుకుందాం?" నరసయ్య ప్రేమగా అడిగాడు. ఎన్నో పేర్లు ఇటు తరాలు, అటు తరాలు తిరగేసారు. ఏదీ నచ్చలేదు. చివరకు "కమలరాణి" అంది మాణిక్యాంబ. నరసయ్యకు నచ్చింది. రాణి అని ముద్దుగా పిలుచుకోడం మొదలు పెట్టారు. రాణికి జ్వరం తగిలి పోలియో వచ్చింది. చూస్తూండగానే రాణి కుంటిదయింది. ఎంతో వైద్యం చేయించారు. కాని రాణి అవిటిదైపోయింది. ఆ దంపతులు దుఃఖాన్ని కడుపులోనే దాచుకున్నారు. రాణిని ఎంతో గారాబంగా పెంచుకుంటున్నారు.

"నువ్వు కలువల రాణీవమ్మా! ఆ చంద్రునికీ మచ్చ ఉందమ్మా!" తల్లి మాటలకి నిజమే అనుకునేది ఆ చిన్నారి రాణి! పిల్లని నేలమీద నడవనిచ్చేవారు కారు. ఎక్కడికి వెళ్ళినా ఆ తల్లి చంకన వేసుకుని వెళ్ళేది.

తండ్రి ఓ వ్యాపారి దగ్గర పనిచేసేవాడు. రోజూ ఓ పకోడి పొట్లం పట్టుకొచ్చి కూతురికిచ్చేవాడు. క్రమంగా ధరలు పెరిగాయి. వారి ఆదాయం పెరగలేదు. పకోడీ పొట్లం చిన్నదై పోయింది.

"ఇంత చిన్న పొట్లం తెచ్చావేం నాన్నా? నేను తినను" అంటూ పేచీ పెట్టేది రాణి.

"రేపు పెద్ద పొట్లం తెస్తానమ్మా!" అంటు బతిమాలేవాడు ఆ తండ్రి.

"నేను చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తానాన్నా! నీకు బోలెడన్ని పైసలిస్తా!" చిన్న చేతులు చాచి పలికేది రాణి.

"నువ్వు అవిటిదానవు? నిన్నెవరు చూస్తారు తల్లీ! నీకు పెళ్ళి ఎలా అవుతుంది? మా తర్వాత నిన్నెవరు ఆదరిస్తారు. నీ కాళ్ళమీద నువ్వు నడవలేవు? చదువుకుని బతుకు తెరువు నేర్చుకో?" ఆ తల్లిదండ్రుల గుండెలు చెరువవుతుంటే ఆ చిన్నారికి తెలియకుండా కప్పిపుచ్చుకోవడానికి విశ్వప్రయత్నం చేసేవారు.

రాణికి బడికి వెళ్ళే వయస్సు వచ్చింది. అవమానాలు ప్రారంభమయ్యాయి. "కుంటీ! కుంటీ!" అంటూ వేటకుక్కల్లా వెంటపడేవారు బడి పిల్లలు.

"నేను బడికి వెళ్ళనమ్మా! ఇంటి దగ్గరే చదువుకుంటా!" తల్లి ఒడిలో పడి వెక్కి వెక్కి ఏడ్చింది రాణి.

"అలా ఏడవకూడదు తల్లీ! వాళ్ళకు భయపడి నువ్వు బడి మానేస్తే నీకు చదువురాదమ్మా!" నూరి పోసేది ఆ తల్లి. తండ్రి రోజూ సైకిలు మీద బడికి దిగబెట్టి తీసుకువచ్చేవాడు. రాణి నిజంగానే బాగా చదువుకుంటోంది. టీచర్లు కూడా ఎంతో మెచ్చుకొనేవారు.

రాణి తాటాకు చాపమీద కూర్చుని చదువుకునేది. వంటి మీద నగలే లేవు. ఆమె చేతికి బంగారు ఆభరణాలు లేవు. ఆమెకు పుస్తకమే హస్తభూషణం. ఛాయ నలుపే. విశాలమైన ఆమె కళ్ళు సంధ్యల్లో వెలిగే దీపాల్లా ఉంటాయి. వెనుతిరిగితే పొడవైన ఆమె నల్లని జడే ఆమెకు మరింత శోభ.

ఆ తల్లీ కూతుళ్ళ దురదృష్టమేమిటో గాని జబ్బు చేసి ఆ యింటి యజమాని నరసయ్య హఠాత్తుగా చనిపోయాడు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి కొలబద్ధలా ఉంది. ఆ చిన్న పెంకుటిల్లు తప్ప వేరే ఆదాయం లేదు. మాణిక్యాంబ దుఃఖానికి అంతులేదు. కొన్నాళ్ళ పాటు ఆ షాపుకారు, నెలకి అవసరమయ్యే సరుకులు పంపిస్తానన్నాడు. భర్తపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్నా కడుపుకు మేత తప్పదు. గుండెరాయి చేసుకుని సంసారం ఈడ్చుకురావడానికి ప్రయత్నిస్తోంది. అయినా పిల్లను పెంచడం కష్టమైపోతోంది.

"మాణిక్యాంబా! నీకీ కష్టాలేందుకే? నువ్వు, నీ కూతురు నాకు బరువు కారు. నా దగ్గర ఉండండి!" అన్నగారు వచ్చి బతిమాలాడు. భార్యపోయి పిల్లలతో నానా ఇబ్బందులు పడుతున్న అన్నగారి స్వభావం ఆవిడకు బాగా తెలుసు. అయినా గత్యంతరం లేక అంగీకరించింది. ఉన్న సామాను మూట కట్టుకుని అన్నగారి వెంట బయలుదేరింది. ఆనాటి నుంచి ఆ తల్లీ కూతుళ్ళకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

ఒక రోజు మామూలుగానే చదువుకుంటోంది రాణి. స్కూలుకు వెళ్ళి చదువుకుంటానంటే "ఇంట్లో చదువుకుని ఏడు! నువ్వు ఉద్యోగం చేస్తావా? ఊళ్ళు ఏలుతావా? కుంటిదానివని మర్చిపోకు" అంటూ తిట్టాడు మేనమామ. అప్పటి నుంచి స్కూలుకి వెడతానని అనలేదు రాణి!

"పరాయి పంచన పడి ఉన్నాం! వాళ్ళేం చెబితే అదే వినాలమ్మా! మనం బానిసలం" అంటూ కూతుర్ని ఒడిలోకి తీసుకుని కారే కన్నీళ్ళు తుడుచుకుంది. తల్లి

పమిటకొంగు చాటున వెక్కి ఏడ్చింది రాణి. గతం గుర్తుకువచ్చి రాణి మనస్సు కలుక్కుమంది.

అటుగా వెడుతున్న మేనమామ రాణిని చూసాడు. ఆమె చేతిలో పుస్తకాలు, పెన్ను లాక్కుని దూరంగా విసిరివేసాడు. "నీకు చదువెందుకే? మీ అమ్మతోపాటు అంట్ల గిన్నెలు తోమవే! దారినపోయే ఓ బిచ్చగాడిని బతిమాలితెచ్చి నీ మెడలో తాళి కట్టించేస్తా! నీకు చదువెందుకే కుంటిదానా?" అంటూ ఆమెను పట్టుకుని రెండు వాయించాడు. పెద్దపులి కోరల్లో చిక్కిన లేడిపిల్లలా విలవిల్లాడుతోంది రాణి, చూడలేకపోయింది మాణిక్యాంబ. అన్నగారి చేతుల్లోనుంచి కూతుర్ని విడిపించింది. చెదిరిన కూతురు జుట్టు సరిచేసింది. కారే ఉన్నీళ్ళు తుడిచింది. ఆ బందిఖానా నుంచి వెళ్ళిపోవాలని నిశ్చయించుకుంది. తన కంటే తన కూతురు జీవితం ముఖ్యం. పైగా చదివించి ఉద్యోగస్తురాలిని చేస్తానని చనిపోతున్న భర్త చేతిలో చెయ్యివేసింది. ఉన్న నాలుగు బట్టలు సర్దుకొని బయలుదేరింది.

"ఎక్కడికి పోతావే? ఆడదానివి పో! ఆ కుంటిదాన్ని వెంటేసుకుని పోవే?" అంటూ అన్న అరుస్తున్నా, అన్న ఇల్లు వదిలింది. సొంత ఊరులో ఉన్న ఇల్లు అమ్మింది. ఏ దిక్కూలేని వారికి రెక్కలే దిక్కు అనుకుంది. "కష్టేఫలే!" అన్న సిద్ధాంతం నమ్ముకుంది. తెలిసున్న వాళ్ళ సహాయంతో పట్నం చేరుకుంది. "ఏదైనా పనిచేస్తా!" అంటూ పొట్టకూటి కోసం ఇల్లిల్లు తిరిగింది. తెలియని ఊరు. ఎవరు ఈసడించినా సమ్మతంగా స్వీకరించింది. అవమానాలు పడటం భర్తపోయిననాటి నుంచే అలవాటు చేసుకుంది. ఆమె వాటన్నిటికి ఇప్పుడు అతీతురాలు. కూతురిని చదివించాలి. అదే ఆమె ధ్యేయం. చివరకు ఒక లాయరింట్లో వంట పనికి కుదిరింది. క్రమంగా ఆ ఇంట్లో ఒక వ్యక్తిగా కలిసిపోయింది. పిల్లను స్కూల్లో చేర్పించారు. మాణిక్యాంబ ముసలిదైపోయింది. రాణి చదువు పూర్తయింది. ఉద్యోగం కూడా దొరికింది.

ఇప్పుడు రాణి ఒక ఆఫీసులో ఆఫీసరు. "అమ్మగారూ! ఎవరో ముసలాయన మీ సంతకం కోసం చంపుతున్నాడు. పంపించమంటారా?" భయపడుతూ వినయంగా అడిగాడు యాదయ్య. "ముసలాయన అంటున్నావుగా! వెంటనే పంపించవయ్యా!"

"అలాగేనమ్మా!"

యాదయ్య ఆ ముసలాయన్ని లోపలికి పంపించాడు. రాణి తల వంచుకుని అర్జంటు ఫైలు చూస్తోంది. "అమ్మా! నమస్కారం! పొద్దుటి నుంచి మీ సంతకం కోసం చూస్తున్నాను" అంటూ ఓ కాగితం అందించాడు. అతని ముఖం చూడకుండానే

రాణి అప్లికేషన్ అందుకుంది. పేరు చదివి ఒక్కసారి ఉలిక్కిపడి తలెత్తింది. ఎదురుగా కాస్త నడ్డి వంగిన వ్యక్తి. పొంగివస్తున్న కోపాన్ని అణుచుకోవడానికి ప్రయత్నం చేసింది.

"మామయ్యా! గుర్తు పట్టావా? మీ కుంటి మేనకోడల్ని!" ఆ మాటలకి ఆమెను పరిశీలనగా చూసాడు. ఎక్కడో పోలికలు. ఆయన ముఖం పాలిపోయింది. కాళ్ళకింది భూమి కుంగిపోతున్నట్లు అనిపించింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. నుంచున్న మనిషి తూలిపడబోయాడు. "ఇవిగో మంచి నీళ్ళు తాగు" అంటూ నీళ్ళగ్లాసు అందించింది. కుర్చీలో చతికిలపడ్డ ఆయన మంచినీళ్ళు గటగటా తాగాడు.

"నన్ను క్షమించమ్మా! పిల్లలు నన్ను సరిగా చూడడం లేదు!" ఇంకా ఏదో చెప్పబోయాడు. "అప్లికేషన్ తీసుకువెళ్ళవచ్చు" సంతకం పెట్టి అందించింది. "ఒక్కసారి మీ అమ్మను చూడాలని ఉందమ్మా!"

"మా అమ్మని చూడొద్దు! ఆమె నిన్ను చూస్తే గతం తవ్వుకుని బాధపడుతుంది. మళ్ళీ ఆ మాట అనకు వెళ్ళిపో!" రాణి మాటలు కాస్త కఠినంగానె ఉన్నాయి. అది ఓ అజ్ఞ.

"ఎంత మారిపోయింది రాణి!" ఆ మాటలు పైకి రాలేదు. "మీ అమ్మని ఒక్కసారి చూసి వెడతానమ్మా!" అతను బతిమాలాడు.

"ఇంకెప్పుడు ఆ మాట అనకు! ఇక్కడకే కాదు ఈ వూరు మరి రాకు!" కుర్చీలోంచి కోపంగా లేచింది రాణి. అప్పటికే ఆఫీసు టైం అయిపోయింది.

ఇప్పుడు ఆమె చేతిలో కర్రలేదు. ఆపరేషన్ చేసి సరిచేసి కృత్రిమ పాదాలు అమర్చారు. గమనించినా గుర్తుపట్టలేరు. కాస్త తేడా ఉన్నా నడుచుకుంటూ వెలుతోంది. ఆ మేనమామ గుడ్లప్పగించి చూస్తున్నాడు.

"ఈ కుంటి మేనకోడల్ని చూసావుగా! టాటా! ఛీరియో!" రాణి మేనమామకు టాటా చెప్పి నడుచుకుంటూ వెళ్ళిపోయింది.

"చంద్రునిలోను మచ్చలున్నాయి. చంద్రకాంతికి ఏమి లోటు? నీకు కుంటిదన్న మచ్చ ఉన్నా నీ కేమిలోటు? నువ్వు చందమామవే?". ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. దుఃఖంతో కాదు. గుండెలోని పశ్చాత్తాపం పొంగి కన్నీళ్ళుగా కారింది.

డిసెంబరు 2004.

ప్రపంచ వికలాంగుల దినోత్సవ ప్రత్యేక సంచిక.